ప్రతిభావంతులకు చేయూత



పురుషోత్తపురం జెడ్పీహెచ్ఎస్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

- డిసెంబర్ 7న ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్ష
- ఎంపికైతే ఏడాదికి రూ.12 వేలు
- సెప్టెంబర్ 30వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు

సరుబుజ్జిలి: విద్యార్థుల్లో ఎంతటి ప్రతిభ ఉన్నా ఆర్థిక స్థోమతలేక ఉన్నత విద్యకు దూరమవుతూ పాఠశాల విద్యకే పరిమితమవుతున్నారు. అలాంటి ప్రతిభగల పేద విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకమే జాతీయ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్). ఈ పథకం ద్వారా ఎంతో మంది ప్రతిభ గల విద్యార్థులు ఉన్నత చదువులకు బాటలు వేసుకుంటున్నారు. ఈ పథకంలో ఎంపికైన విద్యార్థికి నాలుగేళ్లపాటు ఏడాదికి రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందుతుంది. 8వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఏడాదికి రూ.12 వేలు చొప్పున రూ.48 వేలు అందనుంది. ఈ ఏడాది డిసెంబర్ 7న జరగనున్న ప్రవేశ పరీక్ష ఉంటుంది. విద్యార్థులు సెప్టెంబర్ 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది.

పరీక్ష విధానం..

ఈ ఏడాది 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ స్కాలర్‌షిప్ కోసం అర్హులు. 7వ తరగతిలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 50 శాతం మార్కులు సాధించాలి. ప్రవేశ పరీక్ష 180 మార్కులకు ఉంటుంది. రీజనింగ్, అర్థమెటిక్, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టులపై ప్రశ్నలు ఉంటాయి. జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.50 పరీక్ష ఫీజు చెల్లిస్తే సరిపోతుంది.

మెరిట్ ప్రాతిపదికన ఎంపిక..

ప్రతిభ ఆధారంగా ఎంపిక జరుగుతుంది. ఈ ప్రవేశ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు స్కాలర్‌షిప్ అందుతుంది.

ఉపకార వేతనంతో ప్రయోజనం



కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉపకార వేతనం వలన ఎంతో ప్రయోజనం ఉంటుంది. భవిష్యత్‌లో విద్యా అవకాశాలు కోసం ఉపకార వేతనం ఉపయోగించవచ్చు. ఉపాధ్యాయులు అందిస్తున్న శిక్షణతో పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉపకార వేతనం పొందుతామన్న ఆత్మవిశ్వాసం ఉంది. ఆ దిశగా కృషి చేస్తున్నాం.

– అంపోలు సాయికిరణ్, విద్యార్థి, పురుషోత్తపురం, సరుబుజ్జిలి మండలం

2008–09లో మొదటిగా ఏర్పాటు చేసిన ఈ పథకం ద్వారా ప్రతీ ఏటా 8వ తరగతి చదివిన విద్యార్థులకు ప్రవేశపరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తారు. గతంలో 9 నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.6వేల వంతున అందేవి. ప్రస్తుతం దీనిని ప్రభుత్వం రెట్టింపు చేసింది. దీంతో విద్యార్థుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఎంపికైన విద్యార్థులకు ప్రతిఏటా నేరుగా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు నగదు జమచేస్తారు. ఈ ఏడాది డిసెంబర్ 7న జరిగే ప్రవేశ పరీక్షకు ఇప్పటినుంచే విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు.

పోటీతత్వం అలవడుతోంది



చిన్నతనంలోనే ఇలాంటి పరీక్షలకు హాజరుకావడం వలన భవిష్యత్‌లో పోటీ పరీక్షలుకు ఎలా సన్నద్ధం కావాలన్న విషయంపై అవగాహన కలుగుతోంది. దీనివలన ఎంత కఠినమైన పరీక్షలనైనా ఒత్తిడి లేకుండా ఆత్మవిశ్వాసంతో ఉత్తీర్ణత సాధించగలం. ప్రతీరోజు సాధన చేస్తున్నాం.

– పి.దుర్గాప్రసాద్, విద్యార్థి, పెదమాలపేట, సరుబుజ్జిలి మండలం

అవకాశాన్ని వినియోగించుకోవాలి



విద్యార్థులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలి. ఆధార్ కార్డులో ఉన్న వివరాల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. ఆర్థికంగా వెనకబడి, ప్రతిభ ఉన్న విద్యార్థులకు ఈ ఉపకారవేతనం వస్తే చాలా ప్రయోజనం ఉంటుంది. అన్ని పాఠశాలల విద్యార్థులకు దరఖాస్తు చేయించి, శిక్షణ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చాం.

– డి.బాలరాజు, ఎంఈఓ, సరుబుజ్జిలి

అన్నదాత పోరును విజయవంతం చేయండి



ఆమదాలవలస: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

ఆమదాలవలస: 'ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు' అనే కార్యక్రమంతో రైతన్నకు బాసటగా వైఎస్సార్‌సీపీ ఈ నెల 9వ తేదీన తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. ఆమదాలవలస పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉదయం 9.30 గంటలకు పార్టీ కార్యాలయం వద్దకు పార్టీ శ్రేణులు, రైతులు చేరుకోవాలన్నారు. ఇక్కడ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేస్తామన్నారు. ఆమదాలవలస పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర వాలంటీర్ విభాగం కార్యదర్శి అత్తులూరి రవికాంత్, రాష్ట్ర బూత్ కమిటీ సంయుక్త కార్యదర్శి దుంపల శ్యామలరావు, ఆమదాలవలస టౌన్ పార్టీ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, జిల్లా ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షుడు కొప్పల ఈశ్వరరావు, సర్పంచ్‌లు, మాజీ కౌన్సిలర్‌లు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

హిరమండలంలో..



హిరమండలం: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిరమండలం: మండల కేంద్రంలో అన్నదాత పోరు పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల వెంకట రామకృష్ణ, పార్టీ నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. రైతు సమస్యలపైన ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఈ నెల 9వ తేదీన రెవెన్యూ డివిజన్ టెక్కలిలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ నాయకులు లోలుగు లక్ష్మణరావు, వంగపల్లి చిన్నారావు, మూకళ్ల చిన్నయ్య, జోగి శ్రీనివాసరావు, గొర్లె తిరుపతిరావు, మీసాల శంకరరావు, నక్క ఆనందరావు, శిమ్మ తేజ, మన్మధరావు, లక్ష్మీనారాయణ, నరేష్, యోగి, మురళి, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్య విద్య దూరం

- వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి



హిరమండలం: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేసి పేదలకు వైద్య విద్యను సీఎం చంద్రబాబు దూరం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 11 మెడికల్ కాలేజీలు తీసుకువచ్చారన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు, పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు దక్కేలా ఆలోచన చేశారన్నారు. అటువంటి వాటిని ప్రైవేట్‌పరం చేయడం సీఎం చంద్రబాబుకు తగదన్నారు. ప్రభుత్వరంగం అంటేనే చంద్రబాబుకు ఇష్టం ఉండదని.. కార్పొరేట్ వర్గాలకు కొమ్ముకాయడమే ఆయన విధానమన్నారు. విద్యతోనే పేదరికం నిర్మూలన అనేది జగన్‌మోహన్‌రెడ్డి విధానమన్నారు. పేద తల్లిదండ్రులపై భారం పడకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటుచేస్తే.. వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేయడం అన్యాయమన్నారు. పంటలు వేసుకున్న రైతులకు ఎరువులు దొరకడం లేదని, సాగునీరు అందడంలేదని.. ఇదేనా సుపరిపాలన అంటూ ప్రశ్నించారు. మంగళవారం టెక్కలిలో నిర్వహించనున్న అన్నదాత పోరు ర్యాలీకి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు తరలిరావాలని కోరారు.

హామీలు నెరవేర్చకపోతే సమ్మెకు సిద్ధం

ఆమదాలవలస:అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే సమ్మె చేపడతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు, జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్–హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆదివారం మహాసభ నిర్వహించారు. 2023 డిసెంబర్, 2024 జనవరిలో 42 రోజుల పాటు పోరాటం చేశామన్నారు. 2024 జులైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారని, నేటికీ కూటమి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు.

కమిటీ ఎన్నిక...

మహాసభలో అంగన్‌వాడీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రాజెక్టు గౌరవ అధ్యక్షురాలిగా పొన్నాడ భూలక్ష్మి, అధ్యక్షురాలిగా బి.జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా పంచాది లతాదేవి, ఉపాధ్యక్షురాలు, సహాయ కార్యదర్శులుగా కె.నాగరత్నం, ఎ.అరుణ, సనపల రమణమ్మ, కంచరాపు మాధవి, బాడాన ఉమ, జె.జ్యోతి, పి.సునీత, కె.రామలక్ష్మి, ఎ.రేణుక, జి.ప్రసన్నరాణి, తదితరులను ఎన్నుకున్నారు.

విక్రాంత్ నియామకంపై హర్షం

హిరమండలం: వైఎస్సార్‌సీపీ సంస్థాగత బలోపేతంలో భాగంగా పార్టీ అధిష్టానం పార్లమెంటరీ నియోజకవర్గాలకు కార్యదర్శులను నియమించింది. పాతపట్నం, పాలకొండ నియోజకర్గాలకు కార్యదర్శిగా ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను నియామకం చేపట్టడంపై పార్టీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఏపీ సురేష్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శిమ్మ సాంబశివరావు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల పార్టీ అధ్యక్షులు మీసాల వెంకటరామకృష్ణ, పెనుమజ్జి విష్ణుమూర్తి, ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాథులు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు హర్షం వ్యక్తం చేశారు.

కార్యవర్గం ఎన్నిక

నరసన్నపేట: స్థానిక జై విజయ దుర్గా లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం ఎన్నిక నిర్వహించారు. ప్రెసిడెంట్‌గా రావాడ భాస్కరరావు, వైస్ ప్రెసిడెంట్‌గా యలమంచిలి భాస్కరరావు, కార్యదర్శిగా పీస సింహాచలం, ట్రెజరర్లుగా జె.కొండలరావు, సి.హెచ్.అచ్యుతరావు, గౌరవ అధ్యక్షులుగా పి.మురళి, పి.బాలకృష్ణతోపాటు మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

మూతపడిన ఆలయాలు



పాతపట్నం: నీలమణిదుర్గ ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకుడు

పాతపట్నం/సారవకోట/కొత్తూరు: చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు పాతపట్నం నీలమణిదుర్గ ఆలయాన్ని మూసివేశామని ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. సారవకోట మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాలను అర్చకులు మూసివేశారు. కొత్తూరు మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంతోపాటు అన్ని ఆలయాలను మూసివేశారు. గ్రహణాంతరం ఆలయంలో సంప్రోక్షణం, శుద్ధి కార్యక్రమాలు చేపట్టి సోమవారం ఉదయం ఏడు గంటలకు భక్తులకు దర్శనం కల్పించనున్నారు.

యూరియా అందించండి మహాప్రభో..



ఆర్డీఓ దృష్టికి సమస్యలు తీసుకెళ్తున్న రైతులు

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మీపురం గ్రామంలో టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి ఆదివారం పర్యటించారు. యూరియా అందించాలని ఆర్డీఓను గ్రామానికి చెందిన రైతులు కోరారు. తమ గ్రామ రెవెన్యూ పరిధిలో 1,100 ఎకరాల విస్తీర్ణం ఉందని, ఈ ఏడాది 250 బస్తాల యూరియా అందించారన్నారు. బయట మార్కెట్లో కొనుగోలు చేస్తే యూరియాతోపాటు వేప నూనె, ఇతర గులికలు కొనాలని ఒత్తిడి చేస్తున్నారని, దీని వలన ఇబ్బందులు ఎదుర్కొన్నామని గ్రామానికి చెందిన రైతులు తెలిపారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లాలో 1,600 మెట్రిక్ టన్నుల యూరియా ఉందని, మరో 1,500 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందన్నారు. బుధవారం నాటికి గ్రామానికి యూరియా సరఫరా చేస్తామన్నారు. గ్రామంలో కౌలు రైతులుకు కార్డులు మంజూరు చేయడంలో జాప్యం జరుగుతుందని ఆర్డీఓ దృష్టికి గ్రామస్తులు తీసుకువచ్చారు. వీఆర్వో రమణమూర్తిపై ఆర్డీఓ అసహనం వ్యక్తం చేశారు. వెబ్‌లాండ్‌లో పలు సమస్యలున్నాయని, ఆ సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరారు. తహసీల్దార్ విజయలక్ష్మి, వ్యవసాయశాఖ ఏడీ ఎల్.వి.మధు, డిప్యూటీ ఎంపీడీఓ ప్రభాకరరావు, ఏఓ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియా అంటగడుతున్నారు..



ఎంపీడీఓకు సమస్యలు వివరిస్తున్న కొత్తూరు రైతులు



వసపలో రైతులుతో మాట్లాడుతున్న గ్రామ సచివాలయం సిబ్బంది

కొత్తూరు: యూరియా కొరత లేదని, రైతులకు అవసరమైనన్ని బస్తాలు అందిస్తామంటూ ఎంపీడీఓతో పాటు గ్రామ సచివాలయం ఉద్యోగులు గ్రామాల్లోని రైతుల వద్దకు వెళ్లి చెప్పాలంటూ కూటమి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఎంపీడీఓ నీరజ ఆధ్వర్యంలో ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌తోపాటు ఇతర సిబ్బంది గ్రామాల్లో పర్యటించారు. రైతులుకు అవసరమైన యూరియా ప్రభుత్వం వద్ద ఉందని, ఆందోళన చెందవద్దన్నారు. గ్రామాల్లో పర్యటించిన బృందాలకు రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. గులికలతోపాటు నానో యూరియా కొనుగోలు చేస్తే తప్ప.. యూరియాను విక్రయించడం లేదని సచివాలయ సిబ్బంది దృష్టికి రైతులు తీసుకువచ్చారు. రైతులుకు అసవరమైన యూరియా గ్రామ సచివాలయం ద్వారా ఇవ్వకపోవడంతో ప్రైవేట్ డీలర్ల నుంచి అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎకరాకు 25 కిలోల యూరియా పంపిణీ చేయడం సరికాదన్నారు. రైతులుకు సరిపడిన యూరియాను ప్రభుత్వమే విక్రయించాలన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూస్తాం

- జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా



రైతులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా

హిరమండలం: జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చేస్తామని జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్‌రాజా అన్నారు. హిరమండలం మేజర్ పంచాయతీ శుబలాయి కాలనీని ఆదివారం సందర్శించారు. ఎరువుల కొరత గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ ఎరువుల వినియోగంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాగులో సస్యరక్షణ ముఖ్యమన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేదన్నారు. మరో రెండు రోజుల్లో జిల్లాకు 1500 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఎంపీడీఓ కాశీప్రసాదరావు, తహసీల్దార్ ప్రసాద్, ఏఓ సంధ్య, ఎస్ఐ కె.వెంకటేష్ ఉన్నారు.

బురదమయం..



వేంకటేశ్వర ఆలయం వద్ద అధ్వానంగా ఉన్న జాతీయ రహదారి

పాతపట్నం: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాతపట్నం మండల కేంద్రంలోని నీలమణిదుర్గ ఆలయం నుంచి బలాజీనగర్–3 మధ్య జాతీయ రహదారి బురదమయంగా తయారైంది. ఫ్లై ఓవర్ పనులు జరుగుతుండటంతో అక్కడక్కడ బీటీ రోడ్డు లేక అధ్వానంగా తయారైంది. శ్రీకాకుళం, టెక్కలి నుంచి పాతపట్నానికి రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన జాతీయ రహదారిని బాగుచేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తా..

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు



కరిమి రాజేశ్వరరావును సత్కరిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య, నాయకులు

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని, పార్టీ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా(పార్లమెంట్) ఎన్నికైన కరిమి రాజేశ్వరరావు అన్నారు. కరిమి రాజేశ్వరరావును నరసన్నపేటలో పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన ప్రధాన నాయకులు ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ.. తనను జిల్లాలో రెండు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిగా నియమించారన్నారు. పార్టీ ఏ ఆశయంతో ఈ బాధ్యతలు అప్పగించిందో వాటిని పూర్తిగా నెరవేర్చడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎరువుల సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం



అన్నదాత పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- అన్నదాతల అవస్థలు
- నరసన్నపేటలో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

నరసన్నపేట: అన్నదాతల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, రైతులు ఇబ్బంది పడుతున్నారని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం క్లస్టర్ ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 9న నిర్వహించనున్న అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ పంటలకు ఎరువులు సరఫరాలో కూడా ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రస్తుతం వరి పంటలకు యూరియా సరఫరా చేయడంలో ద్వంద్వ వైఖరి చూపుతున్నారన్నారు. రైతులకు మద్దతుగా ఈ నెల 9న అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి వైఎస్సార్ కూడలి మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన నాయకులు, రైతులు పాల్గొవాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో రైతులకు జరుగుతున్న అన్యాయాలను వివరించారు. రైతులుకు మద్దతుగా పార్టీ నాయకులు ఉండాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట, జలుమూరు ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, ముద్దాడ బైరాగి నాయుడు, వరుదు వంశీకృష్ణ, కణితి కృష్ణారావు, కణుసు సీతారాం, ఉలకలాపు రవి, జి.వి.రమణి, నక్క తులసీదాస్, బగ్గు రామకృష్ణ, సురంగి నర్సింగరావు, కేసీహెచ్‌బీ గుప్త, బద్దుల రాజశేఖర్ పాల్గొన్నారు.

గ్రహణం ఎఫెక్ట్



నిర్మానుష్యంగా ఉన్న మెయిన్ రోడ్డు

నరసన్నపేట: నియోజకవర్గ కేంద్రం నరసన్నపేట పట్టణం ఆదివారం రాత్రి 7 గంటలకే నిర్మానుష్యమైంది. చంద్ర గ్రహణం కారణంగా అందరూ ఇళ్లకు చేరుకోవడంతో ప్రధాన రహదారిపై పూర్తిగా జన సంచారం కనిపించలేదు. మెయిన్ రోడ్డు రాత్రి 9 గంటల వరకు రద్దీగా ఉంటుంది. వ్యాపారులు తమ షాపులను ముందుగానే కట్టేశారు. టిఫిన్, తదితర షాపులు సాయంత్రం తీయలేదు.

క్లుప్తంగా

మంచి కార్యాలు చేపట్టాలి



సత్సంగంలో పాల్గొన్న ప్రవచనకర్తలు

సారవకోట: ప్రతి ఒక్కరూ మంచి కార్యాలు చేపట్టాలని ప్రవచనకర్త తూలుగు తిరుపతి రావు అన్నారు. పౌర్ణమి పురస్కరించుకుని మండలంలోని కిన్నెరవాడ గ్రామంలో గల పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో అర్చకుడు కొరపాక సిద్దయ్య స్వామి ఆధ్వర్యంలో ఆదివారం ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. తోటి జీవులను ప్రేమతో ఆదరించాలని, ఈ జన్మలో చేసిన మంచి కర్మలు వచ్చే జన్మలో మనల్ని కాపాడుతాయన్నారు. బోయిన వెంకటరమణ, కింతాడ దాలిరాజు, తదితరులు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

వ్యక్తి అదృశ్యం



చంద్రరావు

పొందూరు: మండలంలోని బురిడికంచరాం గ్రామానికి చెందిన చందక చంద్రరావు (48) ఆగస్టు 22న అదృశ్యమైయ్యారని అతని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వి.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. శ్రీకాకుళం వెళ్లి వస్తానని చెప్పి ఇప్పటివరకు రాలేదని పేర్కొన్నారు. గత మూడేళ్లుగా కిడ్నీ, లివర్ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు ఫోన్ నంబర్లకు 63099 90852, 9515337259 తెలియజేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ఆమదాలవలస: పట్టణంలోని ఓవర్ బ్రిడ్జి సమీపంలో స్కార్పియో వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో రోడ్డుప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రెండు వాహనాల వారికీ శ్రీకాకుళంలో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై వివరాలు తెలియాల్సి ఉందని ఆమదాలవలస ఎస్ఐ ఎస్.బాలరాజు చెప్పారు.

పాతపట్నం సబ్ జైల్ తనిఖీ



సబ్‌జైల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు

పాతపట్నం: పాతపట్నం సబ్ జైల్‌లో భద్రత, బ్యారక్‌లు, వైద్య సదుపాయాలను టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు ఆదివారం రాత్రి పరిశీలించారు. ఖైదీలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. రిమాండ్ ఖైదీలను తరలించే సమయంలో జైల్ అధికారులు, పోలీసులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. మహిళా ఖైదీలకు ప్రత్యేక భద్రత కల్పించాలన్నారు. ఇటీవల చోడవరం సబ్‌జైల్ నుంచి ముద్దాయిలు పారిపోయిన సంఘటన నేపథ్యంలో జైల్‌ను పరిశీలించినట్లు డీఎస్పీ తెలిపారు. పాతపట్నం సీఐ ఎస్.సన్యాసినాయుడు, జైల్ సూపరింటెండెంట్ ఎం.సన్యాసినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.


యూరియా వాడకంపై అవగాహన



పెద్దసీదిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రత్యేకాధికారి కరుణాకరరావు

పాతపట్నం: యూరియా వాడకంపై రైతులుకు అవగాహన ఉండాలని మండల ప్రత్యేకాధికారి ఎం.కరుణాకరరావు అన్నారు. మండలంలోని ఏఎస్ కవిటి, ఆర్.ఎల్.పురం, సీది, తదితర గ్రామాల్లోని రైతులకు యూరియా వాడకంపై ఆదివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వరి పంటకు ఏ సమయంలో ఎంత యూరియా వేయాలి, ఎన్ని సెంట్లకు ఎంత వేయాలో వ్యవసాయాధికారులను అడిగి, వారి సూచనలు పాటించాలన్నారు. రైతులు లండ తాతబాబు, చిన్నాల విశ్వనాథం, నరేష్, రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



జిల్లేడు ద్రావణం తయారీ విధానాన్ని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సరుబుజ్జిలి: ప్రకృతి పద్ధతుల్లో వ్యవసాయం సాగు చేయడం వలన అనేక ప్రయోజనాలను రైతులు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అన్నారు. రావివలసలో ప్రకృతి వ్యవసాయ టీమ్ ఆధ్వర్యంలో 200 లీటర్ల జిల్లేడు ద్రావణం తయారీ విధానంపై శిక్షణ కార్యక్రమాన్ని సర్పంచ్ వండాన కృష్ణ ఆదివారం ప్రారంభించారు. ఈ ద్రావణం వలన పొటాష్, పోషకాల లోపాలను అధిగమించవచ్చని ప్రకృతి వ్యవసాయ టీమ్ డీఎంఎంటీ సురేష్ తెలిపారు. సిబ్బంది టి.తిరుపతిరావు, సంతోషి, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.